ప్రతి రోజూ పండగే..

- ఇక పరసల పరంపర
- శివరాత్రి వరకు తీర్థాల సందడి



పూజలు అందుకున్న ప్రసన్న వినాయకుడు



పరసలో పాల్గొన్న భక్తులు, స్థానికులు

కంచరపాలెం: నగరంలో పరసల సందడి ప్రారంభమైంది. సంక్రాంతి మొదలుకుని శివరాత్రి వరకు జరిగే ఈ పరసలతో ప్రతి రోజూ పండగే అన్నట్లుగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో తీర్థాలుగా వ్యవహరించే వీటిని శ్రీరామలీలా పరసల పేరిట ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నగరంలో దాదాపు అన్ని ప్రాంతాలలోనూ ఈ ఉత్సవాలు రోజూ కనిపిస్తుంటాయి. ఈ సందర్భంగా సాముగరిడీ, తప్పెటగుళ్లు, కోలాటం తదితర ప్రదర్శనలు ఆకట్టుకుంటాయి. మర్రిపాలెం, కరాస, తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, అల్లిపురం తదితర ప్రాంతాలలో పరసలు కోలాహలంగా జరుగుతున్నాయి. మంగళవారం జాషువానగర్ ప్రసన్న వినాయక ఆలయంలో, బుధవారం గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం శ్రీసీతారామఅభయాంజనేయ ఆలయంలో, గురువారం రామ్మూర్తి పంతులపేట గౌరీ సంఘం సీతారామాలయంలో, శుక్రవారం కొత్త రెడ్డి కంచరపాలెం గ్రామ సంఘం సంతోషిమాత ఆలయంలో, సోమవారం 104 ఏరియా మర్రిపాలెం గౌరీ సంఘం సీతారామశివాలయ ప్రాంతాల్లో వేర్వేరుగా ఈ పరసలు జరగనున్నాయి.



అలరించిన కోలాటం

కనులపండువగా ప్రసన్న వినాయక తీర్థం

కంచరపాలెం జాషువా నగర్‌లో ప్రసన్న వినాయక తీర్థమహోత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మిడి అచ్చిబాబు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల వెంకటరావు, బొట్టా ఈశ్వరమ్మ, గొల్ల కంచరపాలెం అధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్ ఐఎన్‌టీయూసీ నాయకుడు ఎం.కొండబాబు తదితరులు హాజరై, భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. వీధులన్నీ విద్యుద్దీపాలతో కళకళలాడాయి. ఏడు గ్రామాల సఖ్యతను చాటి చెప్పే భజన చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంఘం గౌరవ అధ్యక్షుడు గొటువాడ నరసింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి(ఆదిబాబు) ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీరామలీలా పరస

56వ వార్డు గవరకంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘంలో శ్రీరామలీలా తీర్థ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల రామ్‌ప్రసాద్, మళ్ల రమేష్‌గారి ఆధ్వర్యంలో కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కార్పొరేటర్ ఎస్.ఆర్.శేఖర్ భజన చెట్టు వద్ద జ్యోతిని వెలిగించారు. సంక్రాంతి కళ ఉట్టిపడేలా రంగుల ఉప్పుతో రంగవల్లిక వేసి భజన చెట్టును ఏర్పాటు చేశారు. సాము గరిడీలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కాళ్ల రామగోవింద్, మళ్ల అనిల్‌కుమార్, కాళ్ల సత్యనారాయణ, పెంటకోట శివ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సందడే సందడి..

పరసలో పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంటుంది. స్టాల్స్‌లో పిల్లలు ఆడుకునే రకరకాల బొమ్మలతో పాటు ఖర్జూరం, పంచదార కోడిపుంజులు, పానీపూరీ, హల్వా, హాట్ చాట్, ఐస్‌క్రీమ్ వంటి తినుబండారాలు విక్రయిస్తారు.



పరసలో ఆట వస్తువులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



భజన చెట్టు వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఘనంగా ఆర్మీ డే వేడుకలు



మోహన్‌రావును సత్కరిస్తున్న ప్రభావతి

సీతంపేట : ఆర్మీ డే సందర్భంగా వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మిలటరీలో ఉద్యోగం చేసిన జేసీవో కె.మోహన్‌రావును బుధవారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మోహన్‌రావు మిలటరీ సర్వీస్‌లో దేశానికి చేసిన సేవ, విధుల్లో ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులు, అనుభవాలు వివరించారు. దేశానికి వెన్నుముకగా నిలిచిన ఆర్మీ ఉద్యోగులకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని, ఇలా చిరు సత్కారంతో గౌరవించుకోవడం మన బాధ్యతని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన వృద్ధ మహిళ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో శుభ, ఎం.జయ, సీహెచ్.పద్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు రగ్గులు పంపిణీ



సరకులు అందజేస్తున్న సత్యనారాయణ, కుమార్

సీతంపేట : సంక్రాంతి సందర్భంగా భారత వికాస్ పరిషత్ ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎం.వి.వి.సత్యనారాయణ, అతని స్నేహితుడు జి.బి.కుమార్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్ వద్ద బుధవారం నారాయణ సేవ నిర్వహించారు. పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అలాగే వృద్ధులు, మహిళలకు రగ్గులు, బియ్యం, పప్పు, బెల్లం, నూనె, వంట సామగ్రి పంపిణీ చేశారు. సుమారు 100 మందికి సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్.రమణారావు, పి.వెంకటేశ్వరరావు, ఎం.వి.రాజశేఖర్, ఎం.వి.శైలజ, మాణిక్యాలరావు, అరుణజ్యోతి, నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి



శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కంచరపాలెం : సమాజసేవలో భాగస్వాములు కావాలని సిటీ వైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ మువ్వల పోలరావు పిలుపునిచ్చారు. కంచరపాలెం పరిధి రామ్మూర్తి పంతులపేటలో కొణతాల వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం శోభన్‌బాబు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలరావు కేక్ కట్ చేసి మాట్లాడారు. సేవా సంఘం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శోభన్‌బాబు చిత్రంతో కూడిన క్యాలెండర్ అవిష్కరించారు. కార్యక్రమంలో కొణతాల వెంకటేశ్వరరావు, చిన్ని, మురళీరాజు, డి.ఎస్.విజయకుమార్, డి.వెంకటరావు, ఎం.సూర్యనారాయణ, పల్లా పైడిరాజు యాదవ్, జి.ఫణిభూషణరావు, కె.సూర్యరత్నం, పి.దేవకి, టి.సూరిబాబు పాల్గొన్నారు.

మూతపడిన బ్యాంకులు



సీతమ్మధారలో మూతపడిన యూనియన్ బ్యాంక్ కార్యాలయం

సీతమ్మధార : కనుమ రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఉత్తర నియోజకవర్గంలోని జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు మూతపడ్డాయి. వాస్తవానికి గతంలో కనుమ రోజు బ్యాంకులకు వర్కింగ్ డేగా వుంది. కానీ రాష్ట్ర బ్యాంకర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కనుమ రోజు పండగ సెలవు ఇవ్వాలని కోరడం, ప్రభుత్వం అంగీకరించి ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. దీంతో బుధవారం బ్యాంకులు మూతపడ్డాయి. సీతమ్మధారలో గల యూనియన్ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్, నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల బరోడా బ్యాంకు, పీ అండ్ టీ కాలనీలోని గ్రామీణ వికాస్ బ్యాంకు మూతపడ్డాయి. అలాగే ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గల హెచ్‌డీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకు, కరూర్ వైశ్యా బ్యాంకు బ్రాంచిలు మూతపడ్డాయి. నిత్యం వినియోగదారులతో రద్దీగా కనిపించే బ్యాంకులన్నీ ప్రభుత్వ సెలవు కారణంగా బోసిపోయి కనిపించాయి. బ్యాంకు పరిసర ప్రాంతాల్లో వాహనాల రద్దీ కానరాలేదు.

పనిచేయని బోరుతో అవస్థలు



రాధాకృష్ణ లే అవుట్ రోడ్డులో పనిచేయని బోరు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధిలో కొన్ని బోర్లు వేసవి రాకుండానే ఎండిపోవడం గమనార్హం. ఇక్కడ రాధాకృష్ణ లే అవుట్ రోడ్డులో గల ఒక బోరు కొన్ని సంవత్సరాలుగా పనిచేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ 27వ నంబర్ గల బోరు పనిచేయకపోవడంతో రాధాకృష్ణ నగర్ మురికివాడ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడి కుటుంబాలకు మంచినీటి కోసం ఈ బోరుబావే ఆధారం. ఇది చాలా కాలంగా పనిచేయకపోవడంతో మంచినీటి కోసం దూరంగా ఉన్న బోరు వద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి రాకముందే అధికారులు స్పందించి ఈ బోరుకి మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ - 3 నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి వెంటనే బోరుకి మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో జీవీఎంసీ దుకాణాలు

పట్టించుకోని జోన్ - 3 అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ దుకాణ సముదాయం

సీతమ్మధార: జీవీఎంసీకి చెందిన టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌కి ఏళ్ల తరబడి మరమ్మతులు, ప్యాచ్ వర్కులు లేకపోవడంతో కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇక్కడి ద్వారకా బస్‌స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే మార్గంలో గల టీఎస్‌ఆర్ కాంప్లెక్సులో అధిక సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ విభాగం పరిధిలో ఈ వాణిజ్య సముదాయం ఉంది. అలాగే ఈ కాంప్లెక్సులో జీవీఎంసీ-ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం, నాటక గ్రంథాలయం కూడా ఉన్నాయి. ఈ కాంప్లెక్సులో దశాబ్దాలుగా చెప్పుల దుకాణాలు, ఫ్రూట్ జ్యూస్, హోటళ్లు, బంగారం దుకాణం, బట్టల దుకాణాలు ఉన్నాయి. వినియోగదారులతో నిత్యం రద్దీగా ఉండే ఈ భవనం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులు రాలిపోతున్నా జీవీఎంసీ ఇంజినీర్లలో చలనం లేదని స్థానిక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా అద్దెలు వసూలు చేస్తున్న జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ విభాగం మరమ్మతులపై దృష్టి సారించడం లేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. వర్షాలు పడితే శ్లాబు నుంచి నీరు కారిపోతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఇక్కడ జీ ప్లస్ 2 విధానంలో రెండు భవనాల్లో దుకాణాలు ఉన్నాయి. నగరంలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజలు ఇక్కడికి షాపింగ్ నిమిత్తం వస్తుంటారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ఇంజినీర్లు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయం అన్యాయం



దీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు, కార్మికులు

సీతంపేట : పోర్టు ఉద్యోగులకు పండగ లేకుండా చేసిన మోదీకి పండగ లేకుండా చేస్తామని సీఐటీయూ పోర్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ హెచ్చరించారు. పోర్టు ఆస్పత్రి టెండర్‌కి ఎవరొచ్చినా అట్టుకుంటామన్నారు. పోర్టు ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరసన దీక్ష బుధవారం నాటికి 107వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందన్నారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వారికి అప్పగించడం అన్యాయమన్నారు. ఏటా మున్సిపాలిటీకి రూ.65 కోట్లు పన్నుల రూపంలో కడుతున్న పోర్టు ఆస్పత్రిని ప్రైవేటు వారికి అప్పగించేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రైవేటీకరణ నిర్ణయం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు జె.సత్యనారాయణ, కె.ఎస్.కుమార్, నాయుడు, బి.జగన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలు



బంధువులంతా కలుసుకుని తీసుకున్న ఫొటో



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో గాలిపటాల విక్రయాలు

సీతంపేట : తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే సంక్రాంతి, కనుమ వేడుకలు నియోజకవర్గంలో కనులపండువగా జరిగాయి. చిన్న పెద్ద తేడా లేకుండా ఇంటిల్లిపాది కొత్త దుస్తులు ధరించి ఆలయాలను దర్శించి పూజలు చేశారు. బంధువులు, స్నేహితుల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇళ్ల ముందు సంక్రాంతి ముగ్గులతో సందడి చేశారు. పిల్లలు కొత్త దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. పిండి వంటలు వండుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఎక్కడెక్కడో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులు ఒకచోట కలుసుకుని ఉత్సాహంగా గడిపారు. ఆ అపురూప క్షణాలను సెల్ఫీలతో ఫోన్‌లో బంధించారు. మరోవైపు సంక్రాంతి సెలవు దినాలు కావడంతో పిల్లలు ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేశారు. శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, పాలబూత్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద గాలిపటాల విక్రయాలు జోరుగా సాగాయి. క్లాత్, పేపర్, పాలిథీన్‌తో చేసిన పలు రకాల గాలిపటాలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. దీంతో ఆయా దుకాణాల వద్ద సందడి నెలకొంది.

అంతా నిర్మానుష్యం

కర్ఫ్యూను తలపించిన రోడ్లు



సీతమ్మధార రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న స్టాళ్లు



నిర్మానుష్యంగా బాలయ్య శాస్త్రి లే అవుట్ రోడ్డు

సీతమ్మధార : ప్రజలంతా పండగకు స్వస్థలాలకు వెళ్లడంతో ఉత్తర నియోజకవర్గం దాదాపుగా ఖాళీ అయిందనే చెప్పాలి. దీంతో ఎక్కడ చూసినా రోడ్లు ఖాళీగా కనిపించాయి. కొన్ని రోడ్లలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ప్రజలు బుధవారం కనుమ పండగ జరుపుకున్నారు. సీతమ్మధార రైతుబజార్‌లో స్టాళ్లు కూడా ఖాళీగానే కనిపించాయి. రైతులు కూడా పండగ సందడిలో ఉండడంతో స్టాళ్లు బోసిపోయి కనిపించాయి. సీతమ్మధార, సత్యం జంక్షన్, బాలయ్య శాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్, గణేష్‌నగర్, గాంధీనగర్, పీ అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ, నక్కవానిపాలెం, క్రాంతినగర్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాలన్నీ ఖాళీగా కనిపించాయి. ఇక్కడి జాతీయ రహదారి మీద మాత్రమే కాస్త ట్రాఫిక్ రద్దీ కనిపించింది. కాలనీ రోడ్లు, వీధి రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. దుకాణాల వ్యాపారులు కూడా శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి, కృష్ణా తదితర జిల్లాల్లోని స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో చాలా వరకు మూతపడి కనిపించాయి. పార్లర్లు, రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడి ఉన్నాయి.

కంచరపాలెం : కంచరపాలెం, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం స్టేషన్ రోడ్డు, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా, ఎన్ఏడీ కొత్త రోడ్డు, జాతీయ రహదారి తదితర ప్రాంతాలు బుధవారం కర్ఫ్యూను తలపించాయి. నగర వాసులు పండగ ఇళ్లల్లో జరుపుకోవడంతోపాటు ఇతర ప్రాంతాల ప్రజలు స్వస్థలాలకు వెళ్లిపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి.



నిర్మానుష్యంగా కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి



జన సంచారం లేక బోసిపోయిన అక్కయ్యపాలెం మెయిన్ రోడ్

బోసిపోయిన రహదారులు

సీతంపేట : నిత్యం వాహనాల రద్దీతో, రణగొణ ధ్వనులతో బిజీగా ఉండే రోడ్లన్నీ జన సంచారం లేక బోసిపోయాయి. సంక్రాంతి పండగకి పట్టణ వాసులంతా సొంతూళ్లకు వెళ్లడంతో నగరంలోని ప్రధాన రహదారులు వెలవెలబోయాయి. సీతంపేట, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్లు, శంకరమఠం రోడ్, రామాటాకీస్ రోడ్ ఖాళీగా దర్శనమిచ్చాయి. కనుమ, ముక్కనుమ కావడంతో నగరంలో ఉన్న కాస్త జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, చిరు వ్యాపారులు దుకాణాలు తెరవకపోవడంతో రహదారుల్లో సందడి లేక బోసిపోయాయి.



నిర్మానుష్యంగా కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కూడలి



ఖాళీగా మారిన ఐటీఐ కూడలి నుంచి జాతీయ రహదారికి వెళ్లే రహదారి

గ్రీన్‌బెల్టులో మందుపార్టీలు



గ్రీన్‌బెల్టు స్థలంలో మద్యం సీసాలు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధిలో గల గ్రీన్‌బెల్టు స్థలాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గ్రీన్‌బెల్టు స్థలాల్లో జీవీఎంసీ మొక్కలు పెంచుతుండగా, మందుబాబులు మాత్రం ఎంచక్కా మందు పార్టీలు చేసుకుంటూ న్యూసెన్స్ చేయడం గమనార్హం. ఇక్కడ రోజూ రాత్రయితే చాలు మందుబాబులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి వాలిపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు వచ్చి చూసేసరికి సీసాలు, స్నాక్స్ కవర్లు, గ్లాసులు దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోజూ ఇక్కడే బహిరంగంగా మద్యపానం చేస్తున్నా అటు లా అండ్ ఆర్డర్, ఇటు ఎక్సైజ్ పోలీసులు చర్యలు తీసుకోకపోవడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. రోజుల తరబడి ఇక్కడ చెత్త పేరుకుపోతున్నా పారిశుద్ధ్య కార్మికులు కూడా సక్రమంగా తొలగించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి, మందుబాబులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల స్వయంగా అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.